క్లుప్తంగా

కార్మికుల సమస్యలపై ఉదాసీనత తగదు



తాడేపల్లిరూరల్: ఏసీసీ కార్మికుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్‌తో కలసి సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. యాజమాన్యం, కార్మికులతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఇస్మాయిల్, పిచ్చయ్య, ఖాసిం, కాసమ్మ, నాగేశ్వరరావు, సాంబశివరావు తదితరలు దీక్షలు నిర్వహించారు.

భక్తులకు అన్నదానం



మంగళగిరి టౌన్: అమావాస్య సందర్భంగా శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని శివాలయం వద్ద వున్న శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి వారి మెట్ల మార్గం వద్ద అన్నదాన కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ప్రతినెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి శాఖా గ్రంథాలయాన్ని శనివారం గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంగదారి సుబ్బరత్తమ్మ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకుల సభ్యత్వం పెంచేలా, విద్యార్థులు తరచు గ్రంథాలయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ అధికారి నాగూర్ బాషాకు సూచించారు.

సిరిపురం కళాశాలలో 'కిశోర వికాసం'

మేడికొండూరు: మండలంలోని సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహ నిషేధ చట్టం, పలు రకాల నైపుణ్య అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్‌లైన్ విభాగ అధికారులు లక్ష్మణ్, సావిత్రి, కళాశాల ప్రిన్సిపాల్ మధు కృష్ణ, కళాశాల లెక్చరర్లు శాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సునీత, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రం సహకారంతోనే అన్నివిధాలా అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



తాడికొండ: కేంద్ర ప్రభుత్వం సహకారంతోనే రాష్ట్రంలో అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం తాడికొండలో స్త్రీ శక్తి పథకం విజయోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి లాం గ్రామం నుంచి తాడికొండ వరకు బస్సులో ప్రయాణించి మహిళలతో ముచ్చటించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ నేతలు ధనేకుల సుబ్బారావు, తలశిల ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రోగ్రామ్స్ అండ్ ప్రొటోకాల్ ఇన్‌చార్జిగా నాగభూషణం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీజేపీ రాష్ట్ర ప్రోగ్రామ్స్ అండ్ ప్రొటోకాల్ ఇన్‌చార్జ్‌గా ఆ పార్టీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం నియమితులయ్యారు. పాతూరి నాగభూషణం గతంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా పనిచేశారు. తనను నియమించిన అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అబద్ధపు హామీలతో వంచన

- వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- చిలువూరులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ



క్యూఆర్ కోడ్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న దొంతిరెడ్డి, నాయకులు

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వపు అబద్ధపు వాగ్దానాలను ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దొంతిరెడ్డి వేమారెడ్డి పార్టీ నాయకులతో కలిసి ముందుగా క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా మోసం చేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకి కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చారని మిగిలిన డబ్బు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకం కేవలం కొన్ని బస్సులు మాత్రమే ఇవ్వడం మోసం చేయడమేనన్నారు. దీని ద్వారా మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని సుమారు 1.60 లక్షల మంది దివ్యాంగులకు పింఛన్లు ఎందుకు తొలగించారో కూటమి నేతలు చెప్పాలని ప్రశ్నించారు.

- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేదవర్గాల వారికి అండగా అనేక విశిష్ట పథకాలు అందించారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్య పొందారని, జలయజ్ఞం ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలం చేశారన్నారు. ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. అదేవిధంగా మహానేత తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం నవరత్నాల పేరుతో పార్టీలు, కులం, మతం చూడకుండా సంక్షేమ పథకాలు అందజేసి అన్నివర్గాల మన్ననలు పొందారని తెలిపారు. కూటమి ప్రభుత్వపు మోసాలను ఇంటింటా వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూ చించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మహబూబ్ సుభాని, సీనియర్ నాయకుడు ఎ.ధనుంజయ్, ము స్లిం మైనార్టీ జిల్లా నాయకులు షేక్ జానీ బాషా, ని యోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సిహెచ్ ఫిలోమని, మండల మహిళా అధ్యక్షురాలు పి.సంసోనమ్మ, చిలువూరు గ్రామ మహిళ అధ్యక్షురాలు షేక్.మహబూబీ, షేక్.బాజీ, షేక్. జానీ, యువకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు నడుం బిగించాలి

ఈగల్ టీమ్ ఎస్పీ నగేష్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈగల్‌టీమ్ ఎస్పీ తదితరులు

మంగళగిరి టౌన్: మాదక ద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్యార్థులంతా నడుం బిగించాలని ఈగల్ టీమ్ ఎస్పీ నగేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని మార్కండేయ కల్యాణ మండపంలో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు శనివారం డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నగేష్‌కుమార్ మాట్లాడుతూ చదువుపై శ్రద్ధ వహించి జీవితాలను ఆనందమయం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలు, ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం పడే శిక్షలను విద్యార్థులకు వివరించారు. అనంతరం అధికారులు మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించే పోస్టర్లను విడుదల చేసి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఫణి, ఈగల్‌టీమ్ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు టంగుటూరి

దుగ్గిరాల: టంగుటూరి ప్రకాశం పంతులు దేశ స్వాతంత్ర్యం కోసం అనేక సార్లు జైలు పాలయ్యారని ఎంపీపీ షేక్ జబీన్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా దుగ్గిరాల మండల సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆమె మాట్లాడుతూ సైమన్ కమిషన్‌ను వ్యతిరేకిచండం, తెల్లవారికి వ్యతిరేకంగా పోరాడడంలో టంగుటూరి ప్రకాశం పంతులు పాత్ర ఎనలేనిదన్నారు. డెప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెహ్రు, ఈఓ వివేకానంద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో..

దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శోభాదేవి టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న విశాఖలో బీసీ మహిళల దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

మంగళగిరి టౌన్: బీసీ మహిళలకు సబ్‌కోటాను ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసిన తరువాతే అమలు జరపాలన్న ప్రధాన డిమాండ్‌పై ఈనెల 30వ తేదీ విశాఖపట్నంలో జరగనున్న మహిళల నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర బీసీ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ జాతీయస్థాయిలో జనగణనలో కులగణన జరిగి ఆపై నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు జరపాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం అందరి బాధ్యత

మంగళగిరిలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర



పరిసరాల పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కమిషనర్ శకుంతల



ఫిరంగిపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ జె.ప్రసాదరావు, సిబ్బంది

మంగళగిరి టౌన్ : స్వచ్ఛదనం – పచ్చదనం అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలను నాటి కాలుష్య నివారణకు కృషిచేయాలని మంగళగిరి – తాడేపల్లి నగర పాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల అన్నారు. ప్రతినెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని డాన్‌బాస్కో స్కూల్ నుంచి యర్రబాలెం, నవులూరు రోడ్డుకు ఇరువైపులా శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ ఈ ఏడాది నగరపాలక సంస్థ పరిధిలో 50 వేల మొక్కలు నాటాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా నవులూరు, యర్రబాలెం రోడ్డుకు ఇరువైపులా 250 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన..

స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై నగర పరిధిలోని మున్సిపల్ మోడల్ ప్రైమరీ హైస్కూల్ ఆవరణలో శనివారం పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు, విద్యార్థులకు ఎంటీఎంసీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన ఇంటినుంచే ప్రారంభం కావాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యాధుల కాలం ముంచుకొస్తున్న తరుణంలో రోగాల బారిన పడకుండా ప్రతిరోజు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

ఫిరంగిపురం: చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. వారు ఆరోగ్యం ఉండేందుకుగాను తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఆహారం తీసుకునే ముందుగా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రంగా ఉన్నప్పుడు అనారోగ్యాలు దరిచేరవని చెప్పారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛంగా ఉంటామని ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ రవిబాబు, ఎంఈఓ షేక్ సుభానీ, వెలుగు ఏపీఎం నాగేశ్వరరావు, వివిధశాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మేడికొండూరు: మాతృ భూమి రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని ఎస్ఆర్ఐ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు అన్నారు. మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్దగల ఎన్నార్ఐ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో 45 రకాల నీడనిచ్చే మొక్కలతో పాటు ఫలాలు ఇచ్చే మొక్కలు నాటారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, అకడమిక్ డైరెక్టర్ కోటా శ్రీనివాస్, కళాశాల ఏఓ బి.సీతారామయ్య, భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ గుంటూరు ఫేస్ సొసైటీ సిబ్బంది, ఎన్ఆర్ఐ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

డీజేలు పెడితే కఠిన చర్యలు

నిడమర్రు(మంగళగిరి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల వద్ద డీజేలు పెట్టి అధిక సౌండ్‌లతో ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. మండలంలోని నిడమర్రు గ్రామ సెంటర్‌లో శనివారం రాత్రి గణేష్ మండపాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకుని కమిటీ ప్రతినిధులు నిరంతరం మండపం వద్ద నిఘా వుంచాలన్నారు. మద్యం సేవించి అల్లర్లకు దిగినా, ప్రజలకు అసౌకర్యం కలిగించినా ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జన గ్రామోత్సవంలో పోలీస్ నిబంధనలను పాటించాలన్నారు. ప్రజల భద్రత, గ్రామంలో శాంతి భద్రతలు కాపాడిల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మేఘనారెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వడ్డేశ్వరం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ మేనేజ్‌మెంట్ అండ్ హ్యూమానిటీస్ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ యూనివర్సిటీ ఎంబీఏ ఎన్ఎస్ఎస్ విభాగం, ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్, ఎస్‌బీఐ కేఎల్‌యూ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్వయం సహాయక, పొదుపు సంఘాలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, చిరు వ్యాపారులు, గ్రామస్తులకు ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థిక సాక్షరత సాధిస్తేనే స్వయం అభివృద్ధి చెందుతుందని, పొదుపు అలవాట్లను పెంపొందించుకుని బ్యాంకింగ్ సౌకర్యాలను వినియోగించటం, రుణాల ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడం, భవిష్యత్ భద్రత కోసం బీమా పథకాలను ఎంచుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ చైతన్య బైనీ మాట్లాడుతూ సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, పొదుపు, రుణాలు, బీమా, డిజిటల్ బ్యాంకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్మన్ మేఘనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు, ఆర్థిక సేవలు, హక్కులు, పొదుపులు, క్రమంగా డిపాజిట్లు చేయడం, బ్యాంక్ ఖాతాలు ప్రారంభం, రైతులు, చిరు వ్యాపారుల కోసం రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ మోసాలతో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర కుమార్, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ కేవీవీ రాజు, గ్రామస్తులు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జోజప్ప, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్, స్వయం, పొదుపు సంఘాల సభ్యులు, వ్యాపారస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నతస్థానాలకు..

డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినిని అభినందించిన ఎంఈఓ



తాడికొండ: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని తాడికొండ ఎంఈఓ–2 ప్రభాకర్ అన్నారు. శనివారం తాడికొండ మండలం దామరపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన అచ్చమ్మ డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించిన సందర్భంగా ఆమెను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకొచ్చేలా శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఆర్.శాంతి, జి.మల్లికార్జునరావు, ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎ.వీరయ్య, జి.దేవరాజు, జి.వెంకటరావు, ఎ.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

మంగళగిరి టౌన్: కుమార్తె అదృశ్యంపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శనివారం మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి పట్టణానికి చెందిన శివమ్మ తన కుమార్తె స్వాతిని నంబూరుకు చెందిన కృష్ణకు ఇచ్చి వివాహం చేసింది. వారికి ఇద్దరు పిల్లలు. గత కొంత కాలంగా అల్లుడు తన కుమార్తెను అనుమానంతో వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపింది. గత రెండు నెలలుగా గొడవల కారణంగా పాత మంగళగిరిలోని తన వద్దే ఉంటూ నగర పరిధిలోని ఆటోనగర్‌లో ఓ కేఫ్‌లో పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పనికి అని వెళ్లిన తన కుమార్తె స్వాతి పనికి రాలేదని షాపువారు ఫోన్ చేసి చెప్పడంతో బంధువులకు, అల్లుడికి ఫోన్ చేసి విచారించగా అక్కడకు రాలేదని చెప్పడంతో తల్లి శివమ్మ మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెండితెరపై 'తెనాలి రౌడీ'

కొంగర జగ్గారావు

- విలనీని పండించిన నటుడు
- కాంగ్రెస్ సేవాదళ్ నుంచి సినిమాకు
- ఆర్.నాగేశ్వరరావు మరణంతో ఆహ్వానం
- 'సాక్షి' జగ్గారావుగా, దుశ్శాసనుడిగా గుర్తింపు
- కెరీర్‌లో 500 పైగా చిత్రాల్లో నటన



విశ్రాంత జీవనంలో

తెనాలి: వెండితెర రౌడీగా తెలుగు సినీపరిశ్రమలో గుర్తింపు పొందిన నటుడు కొంగర జగ్గారావు. కాంగ్రెస్ సేవాదళ్‌లో కీలకంగా పనిచేస్తూ, టంగుటూరి ప్రకాశం పంతులు, గౌతులచ్చన్న, ఎన్జీరంగా అనుంగు శిష్యుడిగా మెలిగిన జగ్గారావు, అనుకోని పరిస్థితుల్లో తనకిష్టం లేని సినీరంగానికి వెళ్లాల్సి వచ్చింది. విలన్‌కు ప్రత్యామ్నాయం కోసం ముఖానికి మేకప్ వేసుకున్న జగ్గారావు, ఆ విలన్ పాత్రలతోనే రాణించారు. 'భీష్మ', 'శ్రీకృష్ణపాండవీయం', దానవీరశూర కర్ణ', 'అడవి రాముడు', 'మోసగాళ్లకు మోసగాడు' మొదలుకుని 'అంతఃపురం', 'డాన్' వరకు 500 పైగా సినిమాల్లో నటించారు. 'సాక్షి' జగ్గారావుగా, దుశ్శాసనుడిగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయారు. ఈనెల 26న ఆయన శతజయంతి సందర్భంగా...

మోరంపూడి స్వగ్రామం..

తెనాలి దగ్గర్లోని దుగ్గిరాల మండల గ్రామం మోరంపూడి జగ్గారావు సొంతూరు. 'కళావాచస్పతి' కొంగర జగ్గయ్యకు దగ్గర బంధువు. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, వెంకటప్పయ్య. 1925 ఆగస్టు 26న జన్మించారు. ఊళ్లోని ప్రాథమిక విద్యతో సరిపెట్టుకుని పసుపు వ్యాపారంలో ఉన్న తండ్రికి తోడుగా ఉండసాగాడు జగ్గారావు. నేతాజీ, గాంధీ అంటే ఇష్టంతో 'ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్'లో అధికారిగా శిక్షణకోసం నాగపూర్ వెళ్లాడు. అనంతరం రాష్ట్ర సేవాదళ్‌ను ఆర్గనైజ్ చేస్తూ గౌతు లచ్చన్న ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేస్తుండేవారు. కార్యకర్తలకు డ్రిల్, కర్రసాము శిక్షణతో బిజీగా ఉంటూ వచ్చాడు. తురుమెళ్లకు చెందిన పర్వతనేని శాంతాదేవితో వివాహమైంది. కుటుంబం కోసం ఉద్యోగం తప్పనిసరైంది. ఎన్జీ రంగా సిఫార్సుతో మాచర్లలోని సిమెంట్ ఫ్యాక్టరీలో ట్రాన్స్‌పోర్ట్ అసిస్టెంట్‌గా చేరారు. మకాం అక్కడకు మారింది.



కొంగర జగ్గారావు

ఆర్.నాగేశ్వరరావుతో మృతితో..

అప్పట్లో సినిమాల్లో ఆర్.నాగేశ్వరరావు విలన్‌గా చేస్తుండేవారు. జగ్గారావును చూసినవారు ఆ నటుడితోనే పోలుస్తుండేవారు. జగ్గారావుకు మాత్రం సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. తెనాలికి చెందిన సినీ నిర్మాత, రచయిత చక్రపాణి బంధువు నలజాల సుబ్బారావు ఒకరోజు వచ్చి, అర్జెంటు అంటూ జగ్గారావును మద్రాస్ తీసుకెళ్లారు. రేలంగి తీస్తున్న 'సమాజం' సినిమాలో నటిస్తున్న ఆర్.నాగేశ్వరరావు చనిపోయారు. ఆ స్థానంలో నటించాలని కోరటంతో కాదనలేకపోయారు జగ్గారావు. మేకప్ వేశాక 'అచ్చు ఆర్.నాగేశ్వర్రావే' అన్నారు. పాండీబజారుకు పాకిందా వార్త. ఎన్టీఆర్ నటిస్తున్న 'భీష్మ' సినిమాకూ పిలుపొచ్చింది. దుశ్శాసనుడి వేషం ఇచ్చారు. ఆ విధంగా జగ్గారావును సినిమారంగానికి తీసుకొచ్చినట్టయింది.

'భీష్మ'తోనే ఎన్టీఆర్‌తో స్నేహం కుదిరింది.

'భీష్మ'తోనే ఎన్టీఆర్‌తో స్నేహం కుదిరింది. ఎన్టీఆర్ తీసే సినిమాల్లోనే కాకుండా ఆయన నటించే ఇతర నిర్మాతల సినిమాలకూ జగ్గారావును సిఫార్సు చేసేవారు. ఇక విఠలాచార్య సినిమాల్లో తప్పనిసరి అవకాశం ఉండేది. తనతోపాటు ఆనందమోహన్, త్యాగరాజు, రాజనాల, సత్యనారాయణ విలన్లుగా ఉండేవారు. వాళ్లు మెయిన్ విలన్లు అయినా జగ్గారావుకో పాత్ర ఉండేది. సినిమాల్లో గుర్రమెక్కడం అంటే భలే సరదా. ఆయన సిగరెట్ తాగే స్టైల్ ప్రత్యేకం! ఫైటింగుల్లో డూప్‌ను ఇష్టపడేవారు కాదు. 'లక్ష్మీకటాక్షం' సినిమాలో ఓ ఫైటింగ్ సీనులో జీవిస్తూ ఎన్టీఆర్ చేతిపై కత్తితో పొడిచారు. తర్వాతిరోజు స్వయంగా కలిసి క్షమాపణ చెప్పారు. ఎన్టీఆర్ తేలిగ్గా తీసుకుని 'డోంట్ వర్రీ బ్రదర్' అనేశారని ఒక సందర్భంగా జగ్గారావు చెప్పారు. 'ప్రాణమిత్రులు' చేస్తుండగా బాపురమణలు పిలిచారు. హీరో కృష్ణతో తీస్తున్న 'సాక్షి' సినిమాలో అవకాశమిచ్చారు. అద్భుతమైన విలనీని పండించి, 'సాక్షి జగ్గారావు'గా నాటి ప్రేక్షకులకు గుర్తుండిపోయారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



సంచార గ్రంథాలయం గురించి వివరిస్తున్న ఆకురాతి కోదండరామయ్య

నవులూరు(మంగళగిరి): చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరు పుస్తక పఠనం చేయడం వలన ఎంతో జ్ఞానాన్ని సంపాదించవచ్చని సంచార గ్రంతాలయ నిర్వాహకులు లక్ష్మీనృసింహస్వామి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ ఆకురాతి కోదండ రామయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని పాత బ్యాంక్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నవులూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల విద్యార్థులకు సంచార గ్రంథాలయం గురించి పుస్తకాలను పంపిణీ చేశారు. ఆకురాతి కోదండరామయ్య సంచార గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి వారి ప్రాముఖ్యత గురించి వివరించడమే సంచార గ్రంథాలయ లక్ష్యమని నిర్వాహకుడు ఆకురాతి కోదండరామయ్య తెలిపారు. పాఠశాలల హెచ్ఎం అంకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

తాడికొండ సీఐ కె వాసు



తాడికొండ: వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని తాడికొండ సీఐ కె.వాసు సూచించారు. మండపాల ఏర్పాటుకు ఎలాంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని, అనమతుల కోసం ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా కమిటీగా ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా https:// ganeshutsav. net లో క్లిక్‌చేసి అనుమతులు పొందాలన్నారు. ఈ విధానంతో గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనంకు అనుమతులు సులభంగా పొందవచ్చన్నారు. ఊరేగింపులు, విగ్రహ ఏర్పాటులో నిబంధనలు పాటించడంతో పాటు పోలీసు శాఖ సూచనలు పాటించి వివాదరహిత ఉత్సవాలకు శ్రీకారం చుట్టాలని ఆయన సూచించారు.